

# నూతన సంవత్సర శుభాకాంక్షలు

'బుధ'

"నూతన నంవత్సర శుభాకాంక్షలు!"

"నూతన వత్సర శుభకామనలు!" అంటూ నన్ను హత్తుకున్నాడు త్రిదీప్. తెల్లటి దుస్తుల్లో స్వచ్ఛంగా మెరిసిపోతున్న ముత్యంలా ఉన్నాడు.

"రా, గౌరవ్! ఇదిగో ఉగాది వచ్చడి!" అంటూ ఒక స్పూనుతో నవరసాల నా జీవితానికి షడ్రుచుల తోడు అందించాడు. ఒక్క క్షణం మిరుమిట్లు గొల్పిన ఒక 'స్పార్క్' ~~లా~~ మెదడులో మెరిసి అంతలోనే మాయమైంది.

టీ.వీ.లో పంచాగ శ్రవణం వస్తోంది. తిథి, వారం, వర్జ్యం, కాల పురుషుడు, తామ్రమూర్తి - ఇలా ఎన్నెన్నో కలుపుకుంటూ సాగిపోతోంది వ్యాఖ్యానం.

"కంప్యూటర్లు రాకపూర్వమే ఈ పంచాంగ కర్తలు ఖచ్చితంగా లెక్కవేసి ఫలానా రోజు సూర్యగ్రహణం, ఫలానా రోజు ఫలానా తోక చుక్క దర్శన మిస్తుందని ఎంత చక్కగా చెప్పారో!" అన్నాను త్రిదీప్‌తో.

నా మాటకు త్రిదీప్ హాయిగా నవ్వాడు. త్రిదీప్ నవ్వితే చాలా చక్కగా ఉంటాడు. స్వచ్ఛమైన హృదయం. మన నంస్కృతిని, సాంప్రదాయాన్ని మెచ్చుకుంటే చాలు త్రిదీప్‌లో అదో వింత కాంతి.

"కంప్యూటర్లు ఇటీవలవి. అసలు ఈ సైన్సు అంతా రెండు శతాబ్దాల ఫలితమే కదా! అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన శాస్త్రాలు, వేదవేదాంగాలు మన సొత్తు. దండయాత్రలు చేసి మన సంపదను, వేద విజ్ఞానాన్ని విదేశీయులు ఎత్తుకుపోయి జ్ఞానామృత మకరందాన్ని గ్రోలి అమరు లవుతున్నారు. మనవాళ్లు మన నంస్కృతినే మరిచిపోతున్నారు. ఇది చూడు, రష్యాలో ముద్రింపబడ్డ పత్రిక!" అంటూ ఒక పుస్తకం. అట్ట చూపి, ఇం కేదో చూపించడానికి పేజీలు తిప్పేస్తున్నాడు త్రిదీప్.

సరిగ్గా రెండు సంవత్సరాల క్రితం, అంటే డిసెంబరు తొంభై సంచిక అది.

"ఇటు చూడు, రష్యాలో ఏం జరిగింది! రష్యా టెలివిజన్‌లో జ్యోతిష్య కార్యక్రమాలు చూపించింది. 'తమారా' ఈ గెడ్డం వ్యక్తి భార్య, ఈయన 'పావెల్ గ్లోబా' - ఇద్దరూ జ్యోతిష్యులే. కాస్మో బయాలజీ కమిషన్‌కు అధ్యక్షుడు ఈయన. పట్టణాల జాతకాలు, వాటి బలాలు అధ్యయనం చేయడం వీరి పని. ఒక స్కూలు కూడా నడిపి జ్యోతిషం పాఠాలు నేర్పారు.

"ఈ టీ.వీ. ప్రోగ్రాములో వీరు ముందుగా ఇచ్చిన బ్రిటన్ వరదలు, రొమేనియా విప్లవం వంటి జ్యోతిష్య ఫలితాలు కార్యక్రమంలో అవి నిజమైన వాస్తవిక సంఘటనలు చూపించారు!" త్రిదీప్ పుస్తకం నాకు అందించాడు.

ఆశ్చర్యపోవడం నావంతు అయింది.

ఆ దంపతుల ఫోటో, వారి పిల్లలు, వారు జాతకాల ద్వారా ఏ విధంగా పెళ్లి చేసుకున్నదీ, ఇండియా గూర్చిన ప్రస్తావన, రష్యన్లు ఇండియాకు వచ్చి ఎలా జ్యోతిష్యం పాఠాలు నేర్చుకున్నదీ, మన గురువులు ఎలా పాఠ్యాంశాలు నేర్పినదీ ...

"చాలా బాగుంది" అన్నాను.

"బిర్లా మందిర్ వెడదామా!" అన్నాడు త్రిదీప్.

త్రిదీప్ మాటను కాదనలేకపోయాను. త్రిదీప్ నా మాట వినడు. నేను త్రిదీప్ మాట వినాల్సివస్తోంది. త్రిదీప్ మొండితనం వెనుక వివేకం ఉంది. నేను త్రిదీప్‌ను కాదని అవివేకిని కాలేను.

సరిగ్గా ఏనభై మూడు రోజుల క్రితం నేను రమ్మన్న చోటికి త్రిదీప్ రాలేదు. బలవంతాన లాక్కెళ్లాను.

అందరూ 'హేపీ న్యూ ఇయర్' మూడ్‌లో ఉన్నారు.

స్టూడెంట్స్ చాలామంది 'ఫేర్‌వెల్ టు నైన్టీ టూ' అంటూ క్లాసులకు కూడా రాలేదు.

ఆ మధ్యాహ్నం స్టూడెంట్స్‌ను సంబోధిస్తూ స్టాఫ్ తరపున, మేనేజ్‌మెంట్ తరపున స్టూడెంట్స్‌కు హేపీ న్యూ ఇయర్ సందేశాన్ని ఇచ్చారు ప్రిన్సిపాల్.

త్రిదీప్, నేనూ నడుస్తున్నాం.

సాయంత్రం ఆరు గంటల సమయం.

'డ్రింక్ ఎన్ జాయ్!' వైన్ షాపు ముందు

రోడ్డుకు ఇటువైపుగా మారుతీ కారు నిలబడి ఉంది. అటూ ఇటూగా రెండు స్కూటర్‌లు, మూడు మోటారు సైకిళ్లు.

"గౌరవ్!" త్రిదీప్ హఠాత్తుగా ఆగి, "అవి .." అంటూ ఆ వాహనాల వైపు చూపించాడు.

"ఆఁ, అవును. మనవాళ్లవే! ఇక్క డెందుకు ... " అన్న నా మాట పూర్తి కాకమునుపే బీరు సీసాతో సుందరం వచ్చి మారుతీ వెనుకవైపు డోర్ తీసి ఎక్కాడు.

కల్యాణ్ మారుతీ ముందువైపు నుంచి దిగి, రోడ్డు క్రాస్ చేసి 'డ్రింక్ ఎన్‌జాయ్' వైపుగా కదిలాడు.

హీరో హోండా వైపుగా నడుస్తూ సుధీర్, ఆనంద్! ఆనంద్ చేతిలో రెండు బాటిల్స్ - న్యూస్ పేపర్‌లో చుట్టి ఉన్నాయి.

త్రిదీప్ చేతి పిడికిళ్లు బిగుసుకున్నాయి.

"నువ్వు ఇటు రా!" అంటూ రోడ్డు పక్కకు ఉన్న టైలర్ షాపు వైపుగా లాక్కెళ్లాను త్రిదీప్‌ను.

స్కూటర్‌పై వస్తున్న ఒక జంట ఆగింది.

"ఆ దెవరో తెలుసా?" అన్నాను నేను.

"ఎవరు?"

"రిటైర్డ్ మేజర్ స్వామి .... !" నా మాటలు పూర్తి కాకమునుపే, వెనుక కూర్చున్న శ్రీమతి స్వామి కిందకు దిగడమూ, స్కూటర్ స్టాండ్ వేసి మేజర్ స్వామి సుధీర్ పక్కన ఉన్న ఆనంద్ వైపు నడవడమూ!

ఎందుకో వెనక్కు తిరిగిన ఆనంద్ తనవైపే వస్తున్న తండ్రిని గమనించి చేతిలోని సీసాలు హఠాత్తుగా సుధీర్ చేతి కందించడం, అందులో ఒక బాటిల్ సుధీర్ సరిగా పట్టుకోలేక కిందపడి భళ్లున పగలడమూ, ఆనంద్ కాలికి బుద్ధి చెప్పడమూ ఒకదాని వెంట ఒకటి సినిమా సన్నివేశంలా జరిగిపోయాయి.

"పుత్రోత్సాహము తండ్రికి పుత్రుడు జనియించినపుడు పుట్టదు జను లా పుత్రుని కనుగొని పొగడగ ..." అప్రయత్నంగా త్రిదీప్ వెంట వెలువడింది ఆ పద్యం.

కారు, ఇతర వాహనాలు హడావుడిగా కదిలిపోయాయి.

వారిలో ఏదో విజయోత్సాహం, విప్లవోత్సాహం.

జనం జరిగేది క్షణంలో గ్రహించి ఎవరి దోవ వారు చూసుకున్నారు.

"ఇలాంటి వాళ్లకు మన మేం చెబితే రిజల్ట్స్ వస్తాయి? ఒక వైపు మేనేజిమెంట్స్ రిజల్ట్స్ కోసం మనపై వత్తిడి ... వీళ్లు చూస్తే ..."

త్రిదీప్ ఆవేదన నిజమే.

'బేబీ కేర్‌సెంటర్'లో పడవేసినది మొదలు తల్లిదండ్రులకు [సారీ! మమ్మీ డాడీలకు] పిల్లలకు మధ్య ఎడం పెరిగిపోతోంది. తల్లిదండ్రుల్ని 'మాటో చేసే విదేశీ వార్తలు ఇంకా మనదేశపు వార్తల్లో చోటు చేసుకోవట్లేదు. కానీ స్టూడెంట్స్ అధ్యాపకులపై చేయి చేసుకోవడం, తల్లిదండ్రులు టీచర్లను దండించడం అప్పుడప్పుడూ 'బాక్స్'లలో కనిపిస్తూంటాయి.

"అందుకే నీవు రమ్మనట్టు నేను రాను. ఇప్పుడు ఎంత ప్రమాదం తప్పింది! అసలే నాకు ఎమోషన్ ఎక్కువ. నీవు వారించక, ఆ 'పేరెంట్ వచ్చి ఉండకపోతే, పెద్ద స్టంట్ జరిగేది. ఒకవైపు సారా వ్యతిరేకోద్యమం ... స్త్రీ శక్తి విజృంభిస్తోంది. 'నిరక్షర కుక్షులు సారా బానిసలు కాగా, అంతో ఇంతో అక్షరాలు నేర్చుకుని సంప్రదాయాన్ని కలిగిన ఈ పిల్లలు 'బీరు'బలులు అవుతున్నారు. కల్పన మేడమ్ ఏమందో తెలుసా! వాళ్లబ్బాయికి నెలకు అయిదు వందలు ఐస్‌క్రీమ్ కోసం ఖర్చవుతుందట! వాడికి ఇంకా చిన్న పిల్లల మనస్తత్వం పోలేదట! అందుకే ఇంటర్ నాలుగు సార్లు తప్పాడట! ... ఆ వెధవ 'సిల్వర్ హెవెన్' బార్ అండ్ రెస్టారెంట్‌లోకి ఫ్రెండ్స్‌తో వెళ్లగా నేను చూశాను."

"మేడమ్‌తో అనకు, ఆవిడ చాలా సెన్సిటివ్!" భయంగా త్రిదీప్ మొహంలోకి చూశాను.

"అనలేదు."

"హమ్మయ్య!" నిట్టూర్చాను నేను.

'టెంపుల్!' అంటే కాదని, నా వెంటే తీసుకెళ్లాను త్రిదీప్‌ను. కారణం - కిలో స్వీట్‌లు తీసుకోవాలి. హేపీ న్యూ ఇయర్ కేక్ అప్పుడే తెచ్చిపెట్టారు. మిత్రబృందం రాబోతోంది. అర్ధరాత్రిదాకా టీ.వీ. ప్రోగ్రాములు, గేమ్స్, సాంగ్స్!

స్వీట్ షాపు వద్ద రద్దీ దూరంగా కనిపిస్తోంది.

"నా కిలాంటివి అసలు నచ్చవ్!" త్రిదీప్ మాటలు నాకు నవ్వు తెప్పించాయి.

త్రిదీప్ సాంప్రదాయమైన కుటుంబం నుంచి వచ్చాడు. పైపెచ్చు పట్టణ స్థాయిలో చదివి సిటీకి వచ్చినవాడు.

వాళ్ల తాతగారు స్వాతంత్ర్య సమరయోధులు కావడంతో విదేశీ వస్తు బహిష్కరణ సన్నివేశాలు బాగా విన్నట్లు ఉన్నాడు. 'ఫారిన్' అన్న ఆలోచనలకు, ఆచరణలకు దూరంగా ఉంటాడు.

అంతే కాదు, గాంధీగారి 'ఎక్స్‌పెరిమెంట్స్ విత్ ట్రూత్'లా తనూ, 'ఎక్స్‌పెరిమెంట్స్ విత్ పావర్టీ' మొదలుపెట్టాడు.

ఈ త్రిదీప్ మెంటాలిటీ తెలియక మొదట్లో ఒకసారి సిటీలోని పోష్ హోటల్‌కి తీసుకెళ్లి, అక్కడ "ఏం తీసుకుందాం" అన్నాను.

"నాకు ఇలాంటివి ఇష్టం ఉండవు. నీకు కంపెనీ ఇవ్వాలి. నీవు ఐస్ తీసుకో, మ రేదైనా తీసుకో! నాకు సింగిల్ చపాతీ తెప్పించు?" అన్నాడు.

"ఇక్కడ చపాతీ కాదు, పరోటా!" అని చెప్పి, రెండు పరోటాలు తెప్పించాను.

పరోటాతో ఇచ్చిన వెజ్‌మీల్ కలిసిన డిష్ చాలా బాగుంది.

బిల్లు చూసి, బయట కొచ్చాక 'గంటసేపు ఉపన్యాసం దంచాడు. రెండు పరోటాలకు ముప్పై రూపాయలు బిల్లు అయింది. అంతే!

"ఆ హోటల్‌లో పరోటా ఒక్క రూపాయి యాభై పైసలు. వీడు పదిహేను రూపాయలు తీసుకున్నాడు" అంటూ మరో హోటల్ వైపు చూపించాడు.

"అసలు ఇండియాలో 'పావర్టీ' లేదు. కిలో 'ఆటా'తో పన్నెండు నుంచి ఇరవైదాకా చపాతీలు చేసుకోవచ్చు. ఒక్కొక్క దాని వెల సలభై నుంచి యాభై పైసలు అవుతుంది.

"వృథా వ్యయం! అనవసరపు ఖర్చులు! అధిక లాభాలు! ధరలపై, మార్కెట్‌పై సరైన నియంత్రణ లేని వ్యవస్థ! లేని పోని తెచ్చిపెట్టుకున్న షోకులు!"

త్రిదీప్ అలా వాపోతూంటే నాకు చాలా ముచ్చటేసింది.

స్వీట్ షాపు ముందు నిలబడ్డాము. దాని



**కవిత :** ఈ రోజు నా కెంతో సంతోషంగా ఉంది.

**సుజాత :** ఏమిటి అంత సంతోషం?

**కవిత :** నిన్న నా బాయ్ ఫ్రెండ్‌ని ఒక దురలవాటు నుంచి దూరం చేశాను.

**సుజాత :** తాగుడా, జూదమా? లేక ...

**కవిత :** అవేమీ కావు, బ్రహ్మచర్యం నుంచి.

**సుజాత :** ? ? ?

ముద్దా రమణమూర్తి (ఎస్. సద్లపల్లి)



## ఖుష్‌బూ ఔదార్యం

గ్లామర్ తారగా తమిళంలో వెలుగొందుతూ, పేరు ప్రఖ్యాతులతో పాటు డబ్బూ సంపాదించిన ఖుష్‌బూ, ఇప్పుడు ప్రతిరోజూ తన ఇంటి వద్ద అన్నదానం చేస్తూ, సినీ పరిశ్రమలో ఉన్న బీదవారిని ఆదుకుంటోంది. ఖుష్‌బూ చేస్తున్న దానాలకు పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అమితంగా డబ్బు సంపాదించిన నటీనటులు ఖుష్‌బూ బాటను అనుసరించటం చాలా మంచిది మెచ్చదగినది. ఎంతమంది అమలు జరుపుతారో చూడాలి!

ఎన్.ఆర్ (హైదరాబాదు)



## జనాల కోసం

భర్త : అదేమిటే, నేను పాడటం మొదలుపెట్టగానే అలా వాకిట్లో నిలబడ్డావేం?
భార్య : లేకపోతే జనాలు మిమ్మల్ని కొడుతున్నా ననుకుంటారు.
భర్త : ? ! ?

కలపర్తి సత్యం (ఏలూరు)



## హీరోయిన్‌గా... నిలదొక్కుకోనున్న రవళి

'95 సంవత్సరం రవళికి అదృష్టం తీసుకొచ్చిందనే చెప్పొచ్చు. దాసరి దర్శకత్వంలో 'ఒరేయ్ రిక్షా' హిట్ కావటంతో రవళికి గుర్తింపు వచ్చింది. ఇప్పుడు పలువురు హీరోలతో, పెద్ద దర్శకుల చిత్రాల్లో నటిస్తోంది. త్వరలో ప్రముఖ నిర్మాత, దర్శకుడు క్రాంతికుమార్ నిర్మించబోయే చిత్రంలో కూడా నటించనున్నది. చకచకా హీరోయిన్‌గా ఎదుగుతున్న రవళిని చూసి పలువురు అబ్బురపడుతున్నారు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని తన టాలెంట్‌ను నిరూపించుకోవలసి అవసరం రవళికి ఉంది. లేకపోతే ఇంతే సంగతులు.

ఎన్.ఆర్. (హైదరాబాదు)

పక్కనున్న మెడికల్ షాపు ముందు నిలబడినట్టుగా ఉంది మా పరిస్థితి.

త్రిదీప్ నా చెయ్యి లాగాడు.

ఏమి టన్నట్టు చూశాను.

దాదాపు పందొమ్మిది సంవత్సరాల అమ్మాయి లేడీస్ సైకిల్‌పై ఒక కాలు కింద పెట్టి నిల్చుంది. ఆ అమ్మాయితో అబ్బాయి మెడికల్ షాపుకు వచ్చాడు. ఏదో కొనుక్కుని వెళ్లిపోయాడు ఆ అమ్మాయితో సహా.

"చూశారా!" మెడికల్ షాపు అతను మా గురించే అన్నాడు.

"ఏమిటి?" నాలో ఏదో తెలియని ఉత్సాహం.

"వా ళ్లిద్దరూ వైఫ్ అండ్ హస్బెండా?" ఆ వచ్చిన ఇద్దరినీ మేము చూశామని అన్నాడు మాతో.

"క్లాస్ మేట్స్ అయి ఉంటారు!" త్రిదీప్ అన్నాడు.

"వీళ్లకు ఎందుకండీ కండోమ్స్, మాలా-డి టాబ్లెట్స్! న్యూ ఇయర్స్ డే ఇలా సెలబ్రేట్ చేసుకోబోతున్నారు!" వెటకారంగా అన్నాడు షాపువాడు.

నా గుండె గుభేలుమంది.

'యువర్ చిల్డ్రన్ అండ్ మై చిల్డ్రన్ ఆర్ ప్లేయింగ్ విత్ అవర్ చిల్డ్రన్' పెళ్లికి ముందే 'డేటింగ్' పద్ధతులు భాగ్యనగరానికి కూడా దిగుమతి కాబోతున్న సూచనలు కనిపిస్తున్నాయే!

విదేశాల్లో భారతీయులు సైతం యుక్తవయసు వచ్చిన తమ పిల్లల్ని ఇండియా పంపించివేస్తున్నారే!

"మే మేమైనా అంటే షాపు ఉంటుందా? ధ్వంసం చేసి పోతారు!" అన్నాడు షాపువాడు.

త్రిదీప్ మొహాన నెత్తుటి చుక్క లేదు.

స్వీట్ పాకెట్ తీసుకుని నేను, త్రిదీప్ మౌనంగా నడుస్తున్నాము.

కాసేపయ్యాక, "గౌరవ్! ఐయామ్ సారీ! ఐ డోన్ట్ వాంట్ టు సెలబ్రేట్ న్యూ ఇయర్స్ డే!" అన్నాడు త్రిదీప్.

నేటి విద్యార్థి లోకం తీరు చూస్తూంటే నా పరిస్థితీ అలాగే ఉంది.

ఎగ్జామ్స్ పోస్ట్‌పోన్ చేయమని గొడవ చేసిన విద్యార్థులు ... చదువుకోవడం వీరి ధ్యేయం కాదు. దండించే ఉపాధ్యాయులపై, ప్రొఫెసర్లపై ఎదురు తిరిగే వీరు విద్యార్థులు కారు, శరీరాలు బలిసిన పశువులు!

త్రిదీప్‌ను ఇంటివద్ద దిగబెడుతూ, "నైట్‌కి రావాలి" అన్నాను.

"సారీ! నేను రాను" అన్నాడు త్రిదీప్.

అన్నట్టే త్రిదీప్ రాలేదు.

నేను, మహేష్, విశ్వం కొంతమంది రాత్రి పదిగంటల ప్రాంతంలో త్రిదీప్ ఇంటికెళ్లి బలవంతాన పిలుచుకొచ్చాం.

దారి పొడుగునా పదిగంటల రాత్రి వేళలో చలిలో ఇళ్ల ముందు పెద్ద పెద్ద ముగ్గులు వేస్తున్నారు. హేపీ న్యూ ఇయర్ అని రంగులతో దిద్దుతున్నారు.

ఆ ముగ్గులను చూస్తూ త్రిదీప్ కూడా కొంచెం జాలీ మూడ్‌లోకి వచ్చాడు.

"సంక్రాంతి సంబరాలు జనవరి ఒకటినాటికే వచ్చాయే!" అంటూ సంబరపడిపోయాడు.

ఆ రోజు రాత్రి పన్నెండు గంటలకు కొత్త సంవత్సరం రానే వచ్చింది. కుర్రకారు కేరింతలు కొడుతూ రోడ్ల పొడుగునా తిరుగుతున్నారు.

"విష్ యూ హేపీ న్యూ ఇయర్!" అంటూంటే, "విష్ యు హేపీ పొంగల్!" అంటూ అందరికీ బదు లిచ్చాడు త్రిదీప్.

"పారే నీటికి లేని రంగులు మధ్యలో వచ్చినా, చివరకు రంగులు అడుగుకు చేరి నీరు స్వచ్ఛంగా ప్రవహిస్తుంది" అన్నాడు త్రిదీప్.

"అంటే?" అన్నాను.

"సంస్కృతిలో మార్పు సహజమే! కాని కలుషితం కాకూడదు" అంటూ ముగ్గుల్ని చూపించాడు, గుడిలో వెలిగే దీపాలను చూపించాడు.

ఆనాటి త్రిదీప్‌కు ఈరోజు నూతన సంవత్సరంలో కాలు పెట్టానని భావిస్తున్న త్రిదీప్‌కు చాలా తేడా ఉంది.

"గౌరవ్! నీ పెళ్లెప్పుడు నాయనా!" అంటూ త్రిదీప్ తల్లి ప్లేటులో ఉగాది వంటకాలతో వచ్చింది.

ప్లేటులో పులిహోర, కుడుములు, పాయసం, రవ్వలడ్డు ... ఉన్నాయి.

టేప్ రికార్డరులో కమ్మని సంగీతం ...

గది అంతటా కమ్ముకున్న సుగంధ పరిమళం ...

వీటన్నింటి కలయికగా మనసులో ఏర్పడ్డ ప్రశాంతత. అ దో అనిర్వచనీయమైన అనుభూతి.

ఈనాడు అరుపులు లేవు, ఉద్వేగం లేదు, ఎదురు చూపు లేదు ... కేకరింతలు లేవు, మిథ్యా విలువలు లేవు ...

జీవితమంతా నూతన సంవత్సరం విస్తరించిన భావన.

అబ్బాయిలు, అమ్మాయిలు కలిసి తిరిగినా, వారి ఆలోచనల్లో ఏదో స్వచ్ఛత.

అర్థమైన జీవితానికి శుభారంభం!

తెలిసీ తెలియని సంతోష సంబరాలు!

సామాజిక చైతన్య స్రవంతి!

గుడిసె ముంగిట, రెండంతస్తుల మేడ ముంగిట పచ్చతోరణాలు!

పండుగ పదిమందినీ ఏకం చేసింది. 'హేపీ న్యూయర్' చెప్పలేని అడుగు వర్గాలవారు కూడా, 'శుభాకాంక్షలు' తోరణాలతో పలికించారు.

రకరకాల ఆలోచనలో ఉపాహారం ముగించాను.

"కొందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుదాం, పద!" అన్నాడు త్రిదీప్.

త్రిదీప్‌ను అనుసరించాను.

ముందే ఎంచుకున్న పది పూరిళ్ల దగ్గరకు తీసుకెళ్లాడు. అక్కడి పిల్లలకు పుస్తకాలు, పెన్నులు ఇచ్చాడు. వారి జీవన విధానాన్ని ఆదాయాన్ని లోటుపాట్లను అడిగి తగిన సలహాలు ఇచ్చాడు. తన అడ్రసు ఇచ్చి, అవసరమైనప్పుడు కలవమన్నాడు.

వాళ్లలోనూ ఏదో ఆనందం!

ఆ పూరిళ్ల ముందు ముగ్గులు 'నూతన సంవత్సర శుభాకాంక్షలు' అని మమ్మల్ని పలకరించాయి.

"పేదరికం, అవినీతి రెండూ రాక్షసులు. ఒకటి సహజమైనది అయితే, రెండోది మనం పెంచి పోషించినది. పేదరికంపై సమరమే ప్రతివాడి ఆకాంక్ష. అవే నూతన సంవత్సర శుభాకాంక్షలు!"

త్రిదీప్ బాటలో పయనిస్తున్నాడు ఈ గౌరవ్.

★